# గొప్పవాడి భార్య

గొప్పవాడికే సుగుణాలూ లేకపోయినా, వాటిని అలవాటు చేసుకోవటం యాతనైనా, ఆ గొప్ప గుణాల్ని డాబుగా ప్రదర్శిస్తే గొప్ప వాడైనాడు. గొప్పవాడి అసలు పేరు, అందరూ మరచి గొప్ప వాడనే పిలుస్తున్నారు. గొప్పవాడు అందరూ అన్నం తినటం మామూలు పనిగనక, తను, నువ్వుల నూనే, నారింజకాయల తొక్కల రసమూ, బహిరంగంగా తాగటం అలవాటు చేసుకున్నాడు. కాని లోపాయికారీగా అన్నం తింటూనే ఉన్నాడనీ, ఎవరో తెలియనివారో, తెలిసినవారో అన్నా, పత్రికలు ఇట్లాంటి వాటిని ప్రజలు నమ్మరని, ప్రచారం చేసి గొప్పవాడి గొప్పతనం నిలబెట్టినై. గొప్పవాడిది వరకే, పెళ్ళి చేసుకొని, ఇద్దరు కొడుకుల్నీ, ఓ కూతుర్నీ కన్నాడు. గొప్పవాడి భార్య గొప్పవాడి గొప్ప తనం కోసం, గొప్ప పనులు చేయలేక, గొప్పవాడి చాత నానా చివాట్లూ తింటోంది. కాని, భార్యా భర్తలు, చాలా అన్యోన్యంగా ఉండటం గొప్ప వాడి గొప్పతనం గనక, పైకి గొప్పవాడు, భార్యని చాలా గొప్పగా, నలుగుర్లో గౌరవిస్తున్నాడు.

గొప్పవాడిలో కూడా సామాన్య కామం ఉన్నది. అది అప్పుడప్పుడు అతన్ని మామూలు మనిషిని చేసినా, గొప్పవాడు తన గొప్పతనానికి, విరుద్ధమని, భార్యని ఏభైయ్యో వడి వొచ్చి, తనకీ ఇంద్రియాల శక్తి అడుగంటిం తర్వాత, నిష్కామకర్మ, ఇంద్రియాల్ని జయించినట్టు ప్రకటించి, భార్యచేత గూడా ఇంద్రియ నిగ్రహం చేయిస్తూ, పదహారేళ్ళ మనుమడికి ఇంద్రియ నిగ్రహం బోధ పరుస్తున్నాడు.

గొప్పవాడు లేని సుగుణాల్ని ప్రకటించటంలో గొప్పతనం బాగా గ్రహించాడు. ఇప్పుడు చాలా గొప్ప గొప్ప సుగుణాల్ని ప్రదర్శిస్తున్నాడు. కాని గొప్పవాడి భార్య సాధారణ మనిషి కావటం ఆవిడకి గట్టి చిక్కే వొచ్చింది. ఆవిడ గొప్పవాడి అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్ళరాదు. కాని గొప్పవాడి కోసం, గొప్పగా నలుగురిలో గొప్పమాటలు మాట్లాడాలి. ఇవన్నీ పాపం గొప్పవాడికి చాతవు కానీ, ఆవిడకి తెలీదాయెను! గొప్పవాడ్నీ గొప్పవాడి భార్యనీ, పత్రికా విలేఖరులు ఏదన్నా అడిగితే, గొప్పవాడి. భార్య నవ్వాలి గాని, ఏమీ మాట్లాడగూడదు. ఆమె పతి ''అనుసరణీయ''గాక పోవటం ఆవిడ గొప్పతనానికేగాక, గొప్పవాడి ప్రతిష్టకీ భంగమాయెను మరి!

## 2

గొప్పవాడి భార్య చదువుకోలేదు. కాని, గొప్పవాడికి ఇది నామర్దాకాదు? తనే గొప్ప సూత్రాలు కొన్ని ఆవిడ పేర పత్రికలకి పంపిస్తున్నాడు. గొప్పవాడి భార్యపేర, కొన్ని పత్రికలలో, అనేక వ్యాసాలు, ఫోటోలు ప్రచురిస్తున్నారు. ఆవిడంత సుగుణవతి ఎక్కడన్నా ఉందా అనిపించేట్టు. కాని గొప్పవాడి భార్యకి మాత్రం ఇదంతా ప్రాణానికి వొస్తోంది. ఆవిడ గొప్పవాణ్ణి ఒకనాడు, పత్రికా విలేఖరులు,

ఫోటోగ్రాఫర్లు, పెద్దమనుషులూ, లేనప్పుడు చూసి మెల్లిగా, '' ఏమండీ! మీరు తినకపోతే మానె న్నన్నా కాసిని వండుకు తిననివ్వండి, మీ గొప్పతనం మీకు ఉంటుంది'' అని అడిగింది, జిహ్వచచ్చి. కానీ గొప్పవాడు వప్పుకోలేదు. గొప్పవాడి భార్య పకోడీలు తిన్నదంటే, అందులో ఉల్లిపాయ పకోడీలు, ఇంకేమన్నా ఉందా? ఎంత లోటు గొప్పతనానికి? అందుకని, మెల్లిగా భార్యని మందలించాడు.

3

జీవితం, ఆనందాన్ని, అభిరుచుల్ని, గొప్పవాడి గొప్పతనం కోసం ధారపోసి, గొప్పవాడి భార్య, బతకటం దుర్భరమని భావించి, ఒకనాడు గొప్పవాడు, రహస్యంగా ధ్యానం వంకతో, వేసే నల్లమందు, గొప్ప కోసం తాగే మంచి నూనే, తాగి, డ్యాక్టర్లకి గూడా అలిమిగాకుండా, గొప్పగా చచ్చింది. ఆవిడ చావడం గూడా గొప్పవాడి గొప్పతనం నిలబెట్టే విషయమే! గొప్పవాడు, న్యాయంగా ఆవిడ్ని దహనం చేయవలసి ఉన్నా, గొప్పవాళ్ళెవరూ, అట్లా చేయలేదు గనుక, గొప్పగా మంచి ముహూర్తంలో భగవన్నామం జపిస్తో ఆవిడని సమాధి చేసేడు. ఆవిడ ఆత్మని బతికున్నప్పుడు పెట్టిన గొప్ప క్షోభలు చాలక, చచ్చింతర్వాత గూడా, ప్రార్థనలు చేసి, ఆవిడ ఆత్మ ఏ లోకానికి చేరాల్సిందీ, తనే నిర్ణయిస్తున్నాడు! గొప్పవాడు, తన భార్యకి గొప్పగా సమాధి చేయటం, వగైరా, అన్ని ఫోటోలు, పత్రికల్లో, గొప్పగా ప్రకటించారు.

గొప్పవాడి జీవితమే గొప్పమరి! గొప్పవాడు, తన 60వ జన్మదినోత్సవానికి, భార్య ప్రథమ సాంవత్సరీకానికి, డబ్బు వసూలు చేసి, భార్య పేర గొప్ప తోట వేయించి, దాంట్లో, ఎల్లకాలాల్లోనూ, చల్లగా, వెచ్చగా ఉండే కుటీరం నిర్మించుకుని గొప్పగా నివసిస్తున్నాడు. తోటలో, తన గొప్పతనం కోసం అన్నీ ధారపోసి, ఉసూరుమని చచ్చిన వెనకటి, ఇద్దరు శిష్యుల పేరా, రెండు రాతి స్థూపాలు నాటించాడు, తన కొత్త, లేత శిష్యురాలి చేత.

*(జ్యోతి సచిత్ర పక్షపత్రిక మార్చి 1, 1948)*